08-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ప్రతిజ్ఞ చేయండి - ఎప్పటివరకైతే సత్యయుగ స్వరాజ్య స్థాపన జరుగదో, అప్పటివరకూ మేము సుఖమయమైన నిద్రను నిద్రపోము, పవిత్రంగా అయి అందరినీ పవిత్రంగా తయారుచేస్తాము"

ప్రశ్న:- డ్రామాలో ఎటువంటి మృత్యువు జరగడం కూడా సంగమయుగపు ఆచారము వంటిది?

జవాబు:- విజయమాలలోకి వచ్చేందుకు పురుషార్థము చేసే మంచి-మంచి పిల్లలు కూడా ఆశ్చర్యం కలిగించేలా వింటారు, వినిపిస్తారు, మళ్ళీ పారిపోతారు అనగా మరణిస్తారు. ఇటువంటి మృత్యువు కూడా సంగమయుగపు ఆచారంగా అయిపోయింది. శ్రీమతంపై నడవని కారణంగా మాయ ఓడించేస్తుంది. తండ్రికి చెందినవారిగా అయి చేతిని విడిచిపెట్టినట్లయితే మరణించినట్లే. భాగ్యానికి అడ్డుగీత పడుతుంది.

పాట:- ప్రతిజ్ఞ చేసి ముంగిటకు వచ్చాము... (దర్ పర్ ఆయే హై కసమ్ లేకే...)

ఓం శాంతి. మధురాతి-మధురమైన, జీవిస్తూ మరణించే పిల్లలు ఈ పాటను విన్నారు, వీరు జీవిస్తూనే బలిహారమైపోయారు. అందరూ బలిహారమవ్వలేదు. నంబరువారు, పురుషార్థానుసారముగా జీవిస్తూ మరణిస్తారు. ఎప్పుడైనా ఎవరైనా ఎవరినైనా ఒడిలోకి తీసుకుంటే లేక దత్తత తీసుకుంటే వారు ఒక పరివారాన్ని వదిలి ఇంకొక పరివారానికి చెందినవారిగా అవుతారు. మేము ఆసురీ పరివారము నుండి మరణించి ఇప్పుడు ఈశ్వరీయ పరివారానికి చెందినవారిగా అయ్యాము - అని పిల్లలకు తెలుసు. ఈశ్వరుడు వచ్చి దత్తత తీసుకున్నారు. అజ్ఞానకాలములో ఎవరూ ఈశ్వరుని చేత దత్తత తీసుకోబడరు. ధర్మ గురువుల చేత దత్తత తీసుకోబడతారు. ఏ విధంగా వల్లభాచార్యులు శ్రీకృష్ణుని మందిరములో పిల్లలను శ్రీకృష్ణుని ఒడిలోకి అప్పజెప్పుతారు, కానీ అది జడ చిత్రము మాత్రమే, అందుకే పూజారులైన బ్రాహ్మణులు వైష్ణవులుగా తయారుచేయడానికి తమ ఒడిలోకి తీసుకుంటారు. ఇలా ఎంతోమంది దత్తత తీసుకుంటారు. ఎవరైతే ఒకప్పుడు ఉండి వెళ్ళారో తప్పకుండా వారికి దత్తత అవుతారని పిల్లలకు తెలుసు. కొందరు క్రైస్టుకు దత్తత అవుతారు, కొందరు ఇబ్రహీంకు దత్తత అవుతారు. వారు ఎప్పుడు ఉండి వెళ్ళారు, వారు మళ్ళీ ఎప్పుడు వస్తారు - ఇది కేవలం పిల్లలైన మీకు మాత్రమే తెలుసు. ఇప్పుడు మీరు జీవిస్తూనే మరణించారు. మీరు ఒక్క తండ్రి స్మృతిలోనే ఉండాలి. లౌకిక తండ్రికి పిల్లలు దత్తతగా వస్తారు, ఆ తర్వాత తండ్రి చనిపోతే పిల్లలు మిగిలిపోతారు. ఇక్కడ మీరు ఎటువంటి తండ్రికి దత్తతగా వచ్చారంటే, వీరు మిమ్మల్ని ఈ మృత్యులోకము నుండి అమరలోకములోకి లేక దుర్గతి నుండి సద్గతిలోకి తీసుకువెళ్తారు. మనుష్యమాత్రులందరి సద్గతిదాత ఒక్కరే. కేవలం మీకు మాత్రమే సద్గతి లభిస్తుందని కాదు. సద్గతి అయితే తప్పకుండా అందరికీ లభిస్తుంది కానీ డ్రామానుసారంగా కొందరికి సతోప్రధానముగా, కొందరికి సతో, కొందరికి రజో, కొందరికి తమో సద్గతి లభిస్తుంది. తమోలోకి వచ్చినా సరే, మొదటే వచ్చీ రాగానే దుఃఖాన్ని అనుభవించరు. మొదట తప్పకుండా సుఖాన్ని అనుభవించాలి. అంతిమంలో అందరూ దుఃఖాన్ని అనుభవిస్తారు.

తండ్రి అంటారు, సద్గతిదాతను, పతిత-పావనుడను నేనొక్కడినే. మొట్టమొదట ఏ ఆత్మలైతే వస్తారో, వారు సుఖాన్ని అనుభవిస్తారు, తర్వాత దుఃఖములోకి వస్తారు. మీరు కూడా నంబరువారు పురుషార్థానుసారముగా మొదట సతోప్రధానములోకి, తర్వాత సతో, రజో, తమోలలోకి వస్తారు. మీరు కూడా నంబరువారుగా సద్గతిని పొందుతారు. ముఖ్యమైన ఎనిమిది రత్నాలు లెక్కించబడతారు కదా. ఇప్పుడు మీరందరూ ద్రౌపదులు. తండ్రికి చెందినవారిగా అయ్యారు కావున తండ్రిని ఎప్పుడూ విడిచిపెట్టకూడదు. కానీ శ్రీమతానుసారముగా స్మృతి చేయకపోతే మాయ చేతిని వదిలింపజేస్తుంది. దత్తత తీసుకోబడతారు, మొదట్లో నడుస్తూ ఉంటారు. మంచి, మంచి పిల్లలు, చాలా మధురమైన పిల్లలు, ఎవరినైతే విజయమాలలో మూడు, నాలుగు నంబర్లలో ఉంచేవారూ, అటువంటి వారు కూడా ఆశ్చర్యవంతులై పారిపోయారు. ఇది కూడా ఈ సంగమయుగపు ఆచార-వ్యవహారమే. ఆశ్చర్యవంతులై వింటారు, వినిపిస్తారు, తర్వాత మరణిస్తారు. ఇది జరుగుతూనే ఉంటుంది. డ్రామాలో వీరి మృత్యువు ఈ విధంగా ఉంది అని అంటారు. తండ్రికి చెందినవారిగా అయి మళ్ళీ చేతిని విడిచిపెట్టినట్లయితే మరణించినట్లే. ఉండేది ఈ ప్రపంచములోనే, కానీ జీవిస్తూ ఇక్కడి నుండి బయటపడి ఆసురీ ప్రపంచములోకి వెళ్ళిపోయారు. ఏదో ఒకటి కారణముగా అవుతుంది కదా. అనడం డ్రామా అనే అంటారు! కానీ శ్రీమతముపై నడవని కారణముగా మాయ చేతిలో ఓడిపోతారు, భాగ్యానికి అడ్డుగీత పడుతుంది. ఈశ్వరునికి చెందినవారిగా అవ్వడంతో ఇక మాయతో యుద్ధం జరుగుతుంది. అంతేకానీ దేవతలకు

మరియు అసురులకు యుద్ధం జరుగదు. మాయ అసురత్వము, అది విజయం పొందుతుంది.

అచ్చా, ఇప్పుడు రాఖీ బంధన పండుగకు ఏమి చేయాలి అని పిల్లలు రాస్తారు. ప్రతి పండుగకు ఏర్పాట్లు అయితే చేస్తారు కదా. రక్షా బంధన పండుగ సందర్భముగా ముందుగానే వెళ్ళి రాఖీని కడతారు. దీని పూర్తి రహస్యము కూడా బుద్ధిలో ఉండాలి. ఇంతకుముందు బ్రాహ్మణ, బ్రాహ్మణీలు రాఖీ కట్టేవారు. ఇప్పుడు సోదరి, సోదరునికి రాఖీ కట్టే ఆచారము మొదలైంది. నిజానికి బ్రాహ్మణులు రాఖీ కట్టేవారు ఎందుకంటే బ్రాహ్మణ జాతి ఉన్నతమైనదిగా, స్వచ్ఛమైనదిగా మహిమ చేయబడింది. బ్రాహ్మణులు నిజానికి సన్యాసుల కన్నా ఉన్నతమైనవారు. కానీ డ్రామానుసారంగా ఈ సమయంలో సన్యాసులు ఉన్నతమైనవారిగా అయిపోయారు. ఇంతకుముందు బ్రాహ్మణులే రాఖీ కట్టేవారు. తర్వాత జన్మాష్టమి నాడు ఆ రాఖీని విప్పేవారు. ద్రౌపది గురించి వర్ణిస్తూ ఆమె తన జుట్టు ముడిని తీసేసినట్లుగా వర్ణిస్తారు. ఋషుల జటలు కూడా ఎప్పుడూ విప్పబడే ఉంటాయి. పతివ్రతా స్త్రీ జడ వేసుకుంటారు. కానీ ద్రౌపది - ఎప్పటివరకైతే మేము మా రాజ్యాన్ని తీసుకోమో అప్పటివరకూ నేను జడ వేసుకోను అని జుట్టు ముడి విప్పేసారు. ఇప్పుడు పిల్లలైన మీకు కేవలం అర్థాన్ని అర్థం చేయించడం జరిగింది. ఎప్పటివరకైతే మనం స్వరాజ్యాన్ని తీసుకోమో, అప్పటివరకూ సుఖముగా నిద్రపోము. విశ్రాంతి పాపము వంటిది అని అంటారు కదా. ఎప్పటివరకైతే స్వరాజ్యం తీసుకోమో, అప్పటివరకూ సుఖము ఎక్కడ - అని లోలోపల ఉత్సాహము ఉంటుంది కదా. సుఖాన్ని భవిష్యత్తులో పొందాలి, దాని కొరకు పురుషార్థము ఇప్పుడు చేయాలి. రక్షా బంధనము అనగా పవిత్రముగా ఉండేందుకు మనం ప్రతిజ్ఞ చేస్తామని ఇప్పుడు మీకు తెలుసు. రాఖీ అనగా ప్రతిజ్ఞకు సంబంధించిన విషయము. ఇప్పుడు ఈ పండుగ ఎప్పటి నుండి ప్రారంభమైంది? ఎందుకు ప్రారంభమైంది? రాఖీ బంధనం యొక్క సలహాను ఎవరు కనుగొన్నారు? ఎవరో ఒక్కరే సలహాను ఇస్తే ఇక వారి పేరు ప్రఖ్యాతమైపోతుంది. కావున ఇది పవిత్రతకు గుర్తు. సోదరి అనగా కుమారి, కుమారీలు ఇది కడతారు. మీరు గృహస్థులకు కూడా వెళ్ళి కడతారు. కుమారులు కుమారులే. సోదరి సోదరునికి కడుతుంది, అతను కుమారుడైనా లేక వివాహితుడైనా సరే కడుతుంది. వివాహం చేసుకుని మళ్ళీ పవిత్రంగా ఉండడం, ఇది చాలా కష్టము. ఈ అంతిమ జన్మలో పవిత్రంగా అవ్వండి అని భగవంతుడు చెప్తారు, అయినా అలా అవ్వరు. కావున నేను ఎప్పుడూ విషాన్ని తాగను అన్న ప్రతిజ్ఞ చేయమని చెప్తూ - సోదరి కుమారుడైన సోదరునికి రాఖీ కట్టాలి. ఎవరైతే ఉండడమే వికారులుగానే ఉన్నారో, వారు ఎప్పుడూ వికారాలను విడిచిపెట్టరు, భగవంతుని ఆజ్ఞను కూడా అంగీకరించరు. కావున ఈ కుమారీ, కుమారుల ఆచారము కొనసాగుతూ వస్తుంది. ఈ పండుగ కూడా సంగమయుగపు పండుగేనని ఇప్పుడు మీరు అర్థం చేసుకుంటారు. సత్యయుగములో అందరూ పవిత్రముగానే ఉంటారు. అక్కడ రాఖీ కట్టుకునే అవసరమే ఉండదు. ఈ ఆచారము సత్యయుగము నుండి కొనసాగుతూ వచ్చిందని కాదు. ఈ ఉత్సవాలన్నీ ఎక్కువలో ఎక్కువ సంగమయుగానికి చెందినవే. లక్ష్మీ-నారాయణుల ఉత్సవాన్ని కూడా ఇప్పుడే జరుపుకుంటారు కానీ దానికి మహత్వము లేదు. శ్రీకృష్ణ జయంతిని జరుపుకుంటారు కానీ అసలు మొదట శ్రీకృష్ణుడిని ఆ విధంగా ఎవరు తయారుచేసారో చెప్పండి అని అడిగితే, పాపం వారికి అది తెలియదు. ఇది కూడా స్పష్టముగా వ్రాయాలి. ఉత్సవాలన్నీ ఈ సమయానికి చెందినవే. సత్యయుగములో ఇటువంటి విషయాలేవీ ఉండవు. ఇవి ద్వాపరములో కొద్ది సమయం తర్వాత ప్రారంభమవుతాయి. దీపావళి ఉత్సవము కూడా ఇక్కడ జరుపుకున్నట్లుగా సత్యయుగములో జరుపుకోబడదు. ఇక్కడ జరుపుకోవడమంటే అర్థము వేరు. ఉత్సవము యొక్క మహత్వము ఎప్పటిది, ఇది అర్థం చేసుకోవలసిన విషయం. ఈ ఉత్సవాలు ఈ సమయానికి చెందినవేనని, శివజయంతి జరిగినప్పుడే ఇవి ప్రారంభమవుతాయని పిల్లలకు అర్థం చేయించడం జరుగుతుంది. శివజయంతి తర్వాత రాఖీ వస్తుంది. పవిత్రముగా అవుతామని ప్రతిజ్ఞను చేస్తారు - మేము భారత్ ను లేక విశ్వాన్ని పవిత్రముగా తయారుచేసేందుకు ఈ అంతిమ జన్మలో పవిత్రముగా అవుతాము.

పిల్లలైన మీ కొరకు ఈ రక్షాబంధన మహత్వము ఎంతో ఉంది. మేము ఎప్పుడూ పతితులుగా అవ్వము - అని ప్రతిజ్ఞ చేయడం జరుగుతుంది. ఇప్పుడు మీరు పావనముగా అయితే రాఖీ కట్టే హక్కు కేవలం పావన కుమారీలైన మీకు మాత్రమే ఉంటుంది. సోదరులకు ఎల్లప్పుడూ పవిత్రముగా ఉండడం కోసం రాఖీని కట్టాలి మరియు ఈ గృహస్థులతో పవిత్రముగా ఉండే ప్రతిజ్ఞను చేయించాలి. పతిత పావనా రండి - అని పిలుస్తారు కదా. కావున గాయనమెవరిదైతే ఉందో, వారే పతితుల నుండి పావనులుగా అవ్వండి అని ప్రతిజ్ఞ చేయిస్తారు. తండ్రి వచ్చి ప్రతిజ్ఞ చేయిస్తారు. శివజయంతి తర్వాత ఉండేది రక్షా బంధనం. హోలీ కూడా జ్ఞానానికి సంబంధించినదే. ధురియా మరియు హోలీ - ఈ రెండు పండుగలు ఈ సమయానికి చెందినవే. హోలీ అనగా పవిత్రంగా అవ్వండి, ధురియా అనగా జ్ఞానాన్ని ధారణ చేయండి. వారేమో రాయి, రప్ప, పేడ మొదలైనవాటితో ఏమేమో తయారుచేస్తూ ఉంటారు! కావున పతిత-పావనుడైన తండ్రే వచ్చి

పిల్లలకు అర్థం చేయిస్తారు.

ఎవరైతే జీవిస్తూ మరణిస్తారో, వారిలో కూడా స్వంత పిల్లలు, సవతి పిల్లలు ఉంటారు. స్వంత పిల్లల లెక్కాచారాలు తప్పకుండా తండ్రి వద్ద ఉంటాయి. తండ్రికి తప్పకుండా పిల్లల కార్య-వ్యవహారాలు, ఆస్తిపాస్తులు మొదలైనవాటన్నింటి గురించి తెలిసి ఉంటుంది. ఎవరికైతే తండ్రి పట్ల పూర్తి ప్రేమ ఉంటుందో, వారే స్వంత పిల్లలు. స్వంత పిల్లలు కూడా నంబరువారుగా ఉంటారు. సవతి పిల్లలు కూడా నంబరువారుగా ఉంటారు. కొందరు కుపుత్రులుగా, కొందరు సుపుత్రులుగా తప్పకుండా ఉంటారు. శివజయంతి కూడా సంగమయుగములోనే జరుగుతుంది. సంగమయుగానికి కూడా సమయము ఇవ్వాలి. ఏ విధంగా లీప్ మాసము అని అంటారు కదా, అలాగే లీప్ శతాబ్దము 100 సంవత్సరాలది ఉంటుంది. ఈ లీప్ శతాబ్దము చాలా ఉన్నతమైనది. 20వ శతాబ్దము అని అంటారు కదా. అందులోనూ ఏ శతాబ్దములోనైతే తండ్రి వస్తారో, దానిని సంగమ శతాబ్దము అని అంటారు. అతలాకుతలం అవ్వడంలో సమయం పడుతుంది. దీపావళి కూడా ఇక్కడిదే. శివజయంతి తర్వాత మళ్ళీ పవిత్రత విషయం ఉంటుందని పిల్లలైన మీకు తెలుసు. మొదటి నుండి పవిత్రత విషయములోనే గొడవ జరుగుతూ వచ్చింది. పవిత్రతతోపాటు జ్ఞానం మరియు యోగము యొక్క హోలీ-ధురియా కూడా కలిసి-కలిసి ఉంటాయి. తండ్రి స్మృతి కూడా చాలా బాగా ఉండాలి. జ్ఞానం యొక్క ధురియా కూడా కొనసాగుతూ ఉంటుంది. జ్ఞాన వర్షం మీపై కురుస్తూనే ఉంటుంది. పవిత్రత విషయములోనే గొడవ జరుగుతుంది. ఇంటిలో, గృహస్థంలో ఉంటూ కూడా పవిత్రముగా ఉండి చూపించండి అని చెప్పేందుకు ఎవరు వచ్చారు? అని అందరూ అంటారు. సన్యాసులైతే స్వయమే ఇళ్ళు, వాకిళ్ళను వదిలి వెళ్ళిపోతారు. గోపీచంద్ రాజు కథ కూడా ఉంది. మీరు రాజ్య భాగ్యాన్ని ఎందుకు వదిలారు అని వారిని అడిగినప్పుడు, వారు - ప్రభువు మిలనము కొరకు వదిలాను అని చెప్పారు. ఈ కథ గురించి మంచి-మంచి పాటలను కూడా పాడుతారు. ఇక్కడ గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రముగా ఉండాలి. పవిత్రత విషయములోనే అన్ని గొడవలూ జరుగుతాయి.

నిజానికి రక్షాబంధనము పవిత్రముగా తయారయ్యే మరియు తయారుచేసే స్మృతిచిహ్నా పండుగ. ఇక్కడ చూడండి, చిన్న-చిన్న పిల్లలకు కూడా సాక్షాత్కారాలు జరుగుతూ ఉంటాయి. ఇప్పుడు చిన్న పిల్లలు ఏమి భక్తి చేసి ఉంటారు? బాబా వెంటనే అందరికీ సాక్షాత్కారం చేయించారు, కావున ఇదేదో ఇంద్రజాలమని భావించేవారు. దీనిని - శివబాబా చరిత్ర అని అంటారు. కూర్చుని, కూర్చునే మాయమైపోయేవారు - దీనిని కూడా డ్రామా అనే అంటారు. ఒకరినొకరు చూసుకుంటూ ధ్యానములోకి వెళ్ళిపోయేవారు - ఈ చరిత్రలన్నీ పరమపిత పరమాత్మవే, అంతేకానీ శ్రీకృష్ణునివి కావు. శ్రీకృష్ణుని పేరు తీసుకొని మొత్తం అంతా అప్రతిష్ఠపాలు చేసారు. భాగవతములో ఏమేమి వ్రాసేసారో చూడండి! శ్రీకృష్ణుడు సత్యయుగ యువరాజు, కానీ అతను చీరలను దొంగలించారని... ఇది చేసారు, అది చేసారు... అని అంటారు కానీ ఇటువంటి చరిత్ర అయితే గానం చేయబడదు కదా. నిజంగానే శ్రీకృష్ణుడు ఇవన్నీ చేసి ఉంటారని ప్రపంచంలోని వారు భావిస్తారు. ఇంకా శ్రీకృష్ణుని శరీరములోకి ఆత్మ వచ్చి ఉంటారు, వారు జ్ఞానాన్ని వినిపించి ఉంటారు అని కూడా అంటారు కానీ అలా జరగదు. ఆ యువరాజు ఎంతో ప్రసిద్ధమైనవారు, ఇంకా రథాన్ని కూడా చూపిస్తారు, ఆ రథములో శ్రీకృష్ణుడిని చూపిస్తారు. గుర్రపు బండి మీద కూర్చొని పాఠశాలను నడపడం జరుగుతుందా? ఇది రాజయోగ పాఠశాల. మీ ఈ యుద్ధము ఎక్కడ, వారు చూపించిన ఆ యుద్ధ మైదానము ఎక్కడ! ఇది మాయపై విజయాన్ని పొందే యుద్ధము. కావున పిల్లలైన మీరు రక్షాబంధనం గురించి అర్థం చేయించాలి. రక్షాబంధనం అనగా పతితులను పావనంగా తయారుచేయడానికి స్వయంగా పరమపిత పరమాత్మ వచ్చారు. బ్రహ్మాకుమారీలైన మీరు మహిమ చేయబడ్డారు. ఎవరైతే 21 కులాలను ఉద్ధరిస్తారో వారే కుమారీ. ఇది సంగమయుగపు విషయమే. తర్వాత ఈ ఉత్సవాలు సత్యయుగములో జరుగవు. రాఖీబంధనం తర్వాత వచ్చేది శ్రీకృష్ణ జయంతి ఎందుకంటే సత్యయుగములో మొట్టమొదటి జన్మ శ్రీకృష్ణునిది, అతని రాజధాని కూడా ఉంది. అతను ఈ సమయంలో - శ్రీకృష్ణుని కులములోకి వెళ్తానని ప్రతిజ్ఞ చేస్తారు. ఇది రాజయోగము. మీరు నరుని నుండి నారాయణునిగా అవుతారు. లక్ష్మీ-నారాయణుల జీవిత గాథ అంటూ ఏమీ లేదు. రాధే-కృష్ణుల జీవిత గాథయే లక్ష్మీ-నారాయణుల జీవిత గాథ అని తండ్రి అర్థం చేయించారు. శ్రీకృష్ణుని జన్మదినాన్ని జరుపుకుంటారు, అచ్ఛా, మరి నారాయణ జయంతి ఎక్కడ? ఏదో ఒక కారణం ఉంటుంది కదా. దాని గురించి తెలియని కారణంగా మొత్తం ఆటనంతా చిక్కులు-చిక్కులుగా చేసేసారు. మహత్వమంతా ఇక్కడిదే. దీపావళి అనేది సత్యయుగము నుండి ప్రారంభమైందని భావించకండి. సత్యయుగములో ఉన్నదే పవిత్ర ప్రపంచము. అందరి ఆత్మలూ మేల్కొని ఉన్నాయి. ఉత్సవాలన్నీ ఈ సమయానికి చెందినవే. ఇప్పుడు మీకు అందరి చరిత్రల గురించి తెలుసు. శివబాబా స్వయంగా వచ్చి - ఇప్పుడు పవిత్రులుగా అవ్వండి అని పిల్లలకు చెప్తారు. ఆత్మలైన మీరు మలినంగా అయిపోయారు. సన్యాసులు - ఆత్మ నిర్లేపి అని అంటారు, అందుకే చాలామంది గుడ్లు,

చేపలు మొదలైనవి తింటే తప్పేమీ లేదు అని అంటారు. అందరికీ తమ-తమ ఆచార-వ్యవహారాలు ఉంటాయి కదా. ఇంతకుముందు కాళి ముందు మనుష్యులను బలి చేసేవారు. శివుడిని నల్లనివారు అని అనరు, అలాగే శంకరుడిని కూడా అనరు. అయితే, బ్రహ్మ మరియు విష్ణువుకు రెండు రూపాలు ఉన్నాయి, తెల్లగా ఉన్నవారి నుండి నల్లగా అవుతారు. ఈ విషయాలన్నింటినీ తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రిపై పూర్తి ప్రేమను ఉంచి స్వంత పిల్లలుగా అవ్వాలి. తమ పూర్తి సమాచారాన్ని తండ్రికి ఇవ్వాలి. ఎప్పుడూ కుపుత్రులుగా అవ్వకూడదు.

2. రక్షాబంధనం యొక్క యథార్థ రహస్యాన్ని బుద్ధిలో ఉంచుకొని తప్పకుండా పవిత్రంగా అవ్వాలి. మాయ చేతిలో ఎప్పుడూ ఓడిపోకూడదు. పవిత్రతా బలంతో స్వరాజ్యాన్ని తీసుకునే ప్రతిజ్ఞ చేయాలి.

వరదానము:- సదా మిలనము అనే ఊయలలో ఊగే తతత్వమ్ అన్న వరదానము కల తండ్రి సమాన భవ

ఏ విధంగా బాప్ దాదా యజమానులైన మీ ఆజ్ఞను గౌరవించి మిలనము జరుపుకోవటానికి వస్తారో, జీ హాజిర్ (హాజరయ్యాను ప్రభు) అన్న పాఠమనుసారముగా హాజరైపోతారో, అలాగే తతత్వమ్ (ఇది మీకు కూడా వర్తిస్తుంది). అమృతవేళ నుండి మొదలుకొని రోజు సమాప్తమయ్యే వరకు ధర్మం మరియు కర్మలో తండ్రి సమానమైనట్లయితే సదా మిలనపు ఊయలలో ఊగుతూ ఉంటారు. ఈ మిలనపు ఊయలలో ఉన్నట్లయితే ప్రకృతి మరియు మాయ, రెండూ కూడా మీ ఊయలను ఊపే దాసీలుగా అయిపోతాయి. సర్వ ఖజానాలు మీ ఈ శ్రేష్ఠ ఊయలకు అలంకారముగా అవుతాయి.

స్లోగన్:- సదా బ్రహ్మబాబా బాహువులలో ఇమిడి ఉన్నట్లయితే రక్షణను అనుభవము చేస్తారు.